తన భవిష్యత్తుకి
బంగారు బాటవేసిన
మిత్రుణ్ణి అతడు
చూడగలిగాడా?

శ్రీసం శ్రీనివాస్
కథ

# చంద్రోదయం

ట్రైన్ స్లో అవటం గమనించి ఆలోచనల్నించి బయటపడి సర్దుకు కూర్చున్నాను. ప్లాట్‌ఫాం చేరుకుంటుండగా బ్రీఫ్‌కేస్ అందుకుని డోర్ దగ్గరకొచ్చి నిలబడ్డాను. నా లెటర్ చూసి వాసన్నయ్య తప్పకుండా స్టేషన్‌కి వచ్చేవుంటాడు. 'జనగాం' పేరు చదవగానే ఎందుకో అప్రయత్నంగా నా హృదయం స్పందించింది. జనంలోకి చూశాను. దూరంగా 'వాసు' అన్నయ్య, జనంలో... చెయ్యూపి కిందకు దిగాను. గుర్తుపట్టి, జనాన్ని తప్పించుకుంటూ గబగబా నా దగ్గరకొచ్చాడు.

''శశాంకా!'' ఆ పిలుపులోని ఆప్యాయత నాకు తెలీందికాదు. ఆత్మీయంగా నన్ను దగ్గరకు తీసుకున్నాడు. నాకు తెలుసు ఇన్నాళ్ళ తరవాత కలుస్తున్నందుకు తనెంత ఆనందపడ్తాడో నేను ఊహించగలను. నా చేతిలోంచి బ్రీఫ్‌కేస్ అందుకుని భుజం మీద వెయ్యేసి ''రారా'' అంటూ దారితీసాడు. ఆ జన ప్రవాహంలోంచి స్టేషన్ బయటకొచ్చాక కాస్త తెప్పరిల్లి అడిగాను. ''వదినెలా వుంది?''


''నిక్షేపంగా వుంది. నువ్వొస్తున్నావని చెబితే అస్సలు నమ్మలేదనుకో!''

ఎందుకని?

''శశికి ఎప్పుడూ బొమ్మలూ, పుస్తకాలు ఆ గొడవే! పెళ్ళిళ్ళకెళితే వూపిరాడుతుందా? ఇంతకీ వొస్తున్నాడా... ఆట పట్టిస్తున్నారా? అంది!'' నవ్వుకున్నా నేను.

''మరి నువ్వేమనుకున్నావ్!?''

''నాకు నమ్మకం వుంది. విజయంటే నీకెంత అభిమానమో నాకు తెలీదూ! తన



పెళ్ళికి రాకుండా ఎలా వుంటావు? 'విజయ ఐతే' పొద్దుట్నుంచీ ఒకటే హడావిడి. 'తొందరగా స్టేషన్ కెళ్ళన్నయ్యా! అంటూ' స్కూటర్ స్టాండ్ తీస్తూ డు.

అన్నాడన్నయ్య.

నేను కూర్చున్నాక బ్రీఫ్ కేస్ తీసుకుని ముందు పెట్టి, "కాఫీతాగెళ్దామా!" అన్నా

"ఒద్దు! ఇంటికెళ్ళి ముందు స్నానం చేసి ఫ్రెష్‌గా అవ్వాలి. ఆ తర్వాతే అన్నీ!" చెప్పాను. సరేనంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడు.

స్కూటర్ జనగాం దాటి మట్టిరోడ్డు పైకొచ్చాక అడిగాను. "మన ఊరు ఇక్కడికి ఎన్ని కిలోమీటర్లుంటుంది?"

"దగ్గరే. మూడు కిలోమీటర్లుంటుందంతే!" చెప్పాడు.

ఎక్కువగా ఊళ్ళు తిరగటం ఇష్టంలేని నేను — ఈ ఊరెప్పుడూ రాలేదు. అమ్మా, నాన్న మాత్రమే వచ్చేవాళ్ళు. వదినది వరంగల్లే కాబట్టి అన్నయ్య పెళ్ళికీ రాలేదీ ఊరు. వరంగల్ వరకే వచ్చి అటునుంచి వెళ్ళిపోయాను. అలాగే అన్నయ్య, వదినా మా ఊరొచ్చి మూడేళ్ళపైనే అయింది. బాధ్యతలూ అవీ ఎక్కువయ్యాయేమో తనూ రావటం తగ్గించేశాడు.

నిజానికి అన్నయ్య నాకు పెద్దనాన్నగారబ్బాయి. కానీ, స్వంత అన్నయ్యకన్నా బాగా కలిసిపోయాడు నాతో. మా ఇంట్లోనే ఉండి చదువుకున్నాడు కాబట్టి తనకి మాతో అనుబంధం బాగా ఏర్పడింది.

చిన్నప్పుడు ఎంత అల్లరి చేసినా విసుక్కునే వాడు కాదు. అమ్మగానీ, నాన్నగారుగానీ కోప్పడుతుంటే అడ్డు వచ్చేవాడు. "వాడెంత అల్లరి చేసినా బాగానే చదువుకుంటాడుగా!" అంటూ వాళ్ళని సమాధానపరిచేవాడు. నేను వచ్చీరాకుండా బొమ్మలు వేస్తుంటే అప్పుడప్పుడూ చూసి "నువ్వు మంచి ఆర్టిస్టవవుతావురా కన్నా!?" అంటూ మురిపెంగా చూసేవాడు. 'కన్నా' అంటే గుర్తొచ్చింది—

ఎప్పుడూ 'శశీ' అనో, 'కన్నా' అనో పిలిచే అన్నయ్య ఈ రోజు పూర్తి పేరు "శశాంకా" అని సంబోధించటం గుర్తొచ్చి అడిగానన్నయ్యని. చిన్నగా నవ్వి చెప్పాడు.

"అప్పుడంటే నువ్వు చిన్నపిల్లాడివి. ఇప్పుడు నీకు కొత్తగా మీసమూ, గడ్డమూ వస్తోంది. ఇంకా అలాగే పిలిస్తే ఉడుక్కుంటావేమోనని!"

"భలేవాడివే! పెద్దాణ్ణయితే మాత్రం?! నువ్వలా పిలుస్తుంటేనే బావుంటుంది. ఇకనించీ అలాగే పిలు!" అన్నాను. నా మాటలకి నవ్వి "నువ్వేమీ మారలేదురా కన్నా" అన్నాడు. నేను నవ్వి, "అదిసరే! అన్నీ ఏర్పాట్లూ జరుగుతున్నాయిగా!?"

"ఆ! ఏర్పాట్లన్నీ పూర్తయినట్టే, దాదాపు బంధువులంతా వొచ్చేసారు కూడా! పిన్ని బాబాయిలదే ఆలస్యం." అన్నాడు.

"వాళ్ళూ వొస్తారు. రేపుదయం!" అన్నాను.

స్కూటర్ మట్టిరోడ్డుపై సాగిపోతోంది. అప్పుడప్పుడూ గతుకుల్లో పడి కుదిపేస్తున్నా, రోడ్డుకిరుపక్కలా వున్న చెట్లనించి వచ్చే చల్లటి గాలివల్ల — ఏం ఇబ్బందిగా అన్పించలేదు. ఊళ్ళోకి ప్రవేశించాం. ప్రతీ ఇంట్లో కనీసం రెండు మూడు చెట్లున్నాయి. ఇటుకల్తో, రాళ్ళతో కట్టిన ఇళ్ళు. గోడలపై ఎర్రమట్టితో అలికి సున్నంతో ముగ్గులూ, చుక్కలూ పెట్టారు. అక్కడక్కడా సగానికి పైగా పడిపోయిన గోడల కడ్డంగా పెట్టిన వెదురు తడకలూ, ముళ్ళకంపలూ — అది నిరాడంబరత్వమో లేక పేదరికమో నాకు

సరిగ్గా అర్థంకాలేదు.

స్కూటరాగిప్పి చాలా ఎత్తైన అరుగులున్న ఇంటి గేటు ముందాగింది. దిగి పరిశీలనగా చూశాను. బామ్మా, తాతయ్యా ఉండేవారట ఈ ఇంట్లో. వాళ్ళ తరువాత పెద్దనాన్నగారు ఉంటున్నారు. వరండాలో గుండ్రటి స్తంభాలూ, పాత కాంపు చెక్కడంతో కూడిన పెద్ద గుమ్మం, మొత్తానికి ఇల్లు జమీందారుల వైభవాన్ని గుర్తుకు తెచ్చింది.

బయట ఆడుకుంటున్న పిల్లల్లోంచి ఓ పాప పరిగెత్తుకుంటూ వొచ్చింది... "హే... నాన్నగారొచ్చారు." అంటూ.

అన్నయ్యా! శిల్ప కదూ!"

"అవునా! నువ్వెప్పుడో సంవత్సరం పిల్లప్పుడు చూసుంటావ్ కదూ!" అన్నాడు. తపాపి ఎత్తుకున్నాను.

"పద!" అంటూ లోపలికి దారితీసాడు. గుమ్మం దగ్గరికెళ్ళేసరికి విజయ ఓ సుడిగాలిలా పరిగెత్తుకొచ్చింది. "శశీ! బావున్నావా" అంటూ. శిల్పని క్రిందకు దించి "ఆ! నువ్వేంటే సన్నబడిపోయావ్!"? అన్నాను. కావాలనే ఉడికించటానికి.

"పోరా! ఇప్పుడూ వెక్కిరించటమేనా?"? అంది. ఈలోగా పెద్దవొదినొచ్చింది కొంగుకి చేతులు తుడుచుకుంటూ. "ఏమయ్యా! దారంతా రోడ్లనీ, ఇళ్ళనీ వింతగా చూస్తూ వొచ్చావా! లేక తిట్టుకుంటూ వొచ్చావా?" ఆట పట్టించింది.

"ఛ! భలేదానివే వొదినా! ఎప్పుడో అన్న మాటలు నువ్వింకా మర్చిపోలేదల్లే వుంది. అదే లేదు, ఊరుకూ, రోడ్లకేం బానే వున్నై! మా మున్సిపాలిటీ రోడ్లకన్నా శుభ్రంగా!" నా మాటలకి అందరూ నవ్వేసారు.

లోపలినుండి వచ్చిన పెద్దమ్మ, పెద్దనాన్నగార్ని చూసి దగ్గరికెళ్ళి కాళ్ళకి నమస్కారం చేశాను. వదిన బ్రీఫ్‌కేస్ అందుకుంది. వెనకాలే నేనూ లోపలకడుగుపెడుతూ ఎందుకో నన్నెవరో గమనిస్తున్నట్టు తోచి వెనక్కి తిరిగి చూశాను. అక్కడ గేట్‌పై చేతులాన్చి, ఒకతను తదేకంగా నన్నే చూడ

## వింత బహుమానం!



పర్యావరణ శాఖా మంత్రిగా ఉన్న మేనకాగాంధీ అడవులకు, వాతావరణానికీ ఎంతో ప్రాముఖ్యతను ఆపాదించి పెట్టింది. ఆమె స్టైల్‌లోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోని పర్యావరణ మంత్రి కమల్‌నాథ్ గారు కూడా నడుస్తున్నారు! ఇక నుంచి ఫంక్షన్‌లలో పూలకు బదులు ఏదో ఒక మొక్కతో కుండీని బహూకరించమని ఆయన చెప్తున్నారు. కనీసం అలా అయినా దేశంలో చెట్ల సంఖ్య పెరుగుతుందని ఆయన ఆశ! కేంద్ర మంత్రులకు, ముఖ్యమంత్రులకూ కూడా ఈ సలహాను, మంత్రిగారు స్వయంగా అందజేశారట! సో... ఇక దేశమంతా... కుండీలేనన్నమాట! శుభం!

—జూపిటర్

టం కన్పించింది. ఆ చూపు ఆపాద మస్తకం పరిశీలిస్తున్నట్టు వుంది. జీన్స్‌పాంట్‌లో, వైట్ ఫుల్‌షర్ట్, షర్ట్ టక్ చేసి, షర్ట్ స్లీవ్స్ మోచేతుల వరకూ వరకూ మడిచి — ఒక చేతిలో గాగుల్స్ పట్టుకుని తిప్పుతూ — విశాలమైన నుదురు... స్టైల్‌గా వున్న ఆ ముఖంలో ఒక తేజస్సు ప్రస్ఫుటంగా కన్పించి ంది. ఎందుకో ఆ వ్యక్తిని ఎక్కడో చూసిన భావన! ఖచ్చితంగా నేనతన్ని ఎప్పుడూ, ఎక్కడా చూడకపోయినా ఆ క్షణంలో నాకెందుకో అలాంటి భావమే కలిగింది. అన్నయ్య ఎదురెళ్తూ "అదేంట్రా చంద్రం ! అక్కడే నిలబడి పోయావేం? లోపలికి రావా ఏంటి?" అన్నాడు. బహుశా స్నేహి తుడయి వుంటాడు.

నా జీవితం ఈ క్షణం నుంచీ మంచిమ లుపు తిరుగుతుందని తెలీని నేను — అప్పుడు లోపలికి నడిచాను.

* * *

పెళ్ళి పనులు జోరుగా జరుగుతున్నా యి. షామియానాలూ, మామిడాకుల తోర ణాలూ, రంగురంగుల సీరియల్ లైట్లూ — పిల్లల సందడీ — పెద్దల హడావిడీ! అమ్మా, నాన్న ఉదయమే వొచ్చారు. రాగానే వాళ్ళూ పెళ్ళి పనుల్లోకి దిగిపోయారు. బామ్మల సలహాలూ, బావల సరసాలు, భామల ముసిముసి నవ్వులూ.... అబ్బ! తెలుగింటి పెళ్ళిళ్ళలో ఎంత నిండుదనం వుంది? ఇంత రమ్యమైన అనుభూతిని దూరం చేసుకుని కొందరు రిజిస్టర్ మ్యారేజ్‌లూ, గుళ్ళళ్ళో పెళ్ళిళ్ళూ — ఎందుకు చేసుకుంటారో అర్థంకాదు.

మధ్యాహ్నం భోజనం కాగానే వదిన ఓ నవల చేతికిచ్చి — "పెరట్లో వేప చెట్టుక్రిం ద మంచం వేసుంది వెళ్ళి రెస్ట్‌తీసుకో" మ్మని చెప్పి వెళ్ళిపోయింది. మెల్లిగా పెరటివే పు నడిచాను. అక్కడ మంచంపై కూర్చుని అన్నయ్యా, నిన్న కన్పించిన చంద్రంగారు — ఏవో లెక్కలు వ్రాసుకుంటున్నారు. నన్ను చూసి అన్నయ్య "రా!" అంటూ కుర్చీ ముందుకు జరిపాడు. ఎందుకో నాకు క్రొత్త వాళ్ళ ముందుకు వెళ్ళాలంటే బెరుకు. అందుకే సందిగ్ధంగా ఆగిపోవటం చూసి "కూర్చో!" అన్నాడు అన్నయ్య. కూర్చోక తప్పలేదు.

"చంద్రం! శశి అని చెప్పలేదూ! మా తమ్ము..." అన్నయ్య మాటలింకా పూర్తికా కుముందే "బి.ఏ చదువుతున్నాడు. బొమ్మ లు గీస్తాడు. కవిత్వం వ్రాస్తాడు. ఇంకా... బోలెడన్ని నవల్లు చదివాడు. బాగా ఆస్తి పరులైన మీ బాబాయ్‌గారి ప్రథమ సంతానం . ఇంతేనా... ఇంకా ఏమయినా మర్చిపోయా నా?" మా ఇద్దరి నవ్వూ చూసి అతనూ శృతి కలిపాడు. అంటే, అన్నయ్య నా గురించి అతనికి అంతా చెప్పేసాడన్నమాట!

"వీడు 'చంద్రశేఖర్' అని నా ఫ్రెండ్. ఈ ఊళ్ళోనే వీళ్ళుండేదికూడా! ప్రస్తుతం ఎమ్.ఎస్.సి కి ప్రిపేర్ అవుతున్నాడు" అతని వివరాలు చెప్పాడన్నయ్య.

అలా మొదలైంది మా స్నేహం. అతని సాహచర్యంలో కొద్దిగా బిడియం పోయినా — పూర్తిగా మనసు విప్పి మాట్లాడేంత దగ్గర కాలేదు నేను. ఖాళీ దొరికినప్పుడల్లా ఏవేవో

అర్థంకాని క్రొత్త క్రొత్త విషయాలు మాట్లాడుతుంటాడతను. 'చంద్రం' మాటల్లో ఎక్కువగా సహజం గూర్చి, వ్యక్తుల మనస్తత్వాల గూర్చీ, రాజకీయాలూ, క్రికెట్టు ఇలాంటి సబ్జెక్ట్సు ఎక్కువగా కన్పించేవి.

నాకలాంటి విషయాలు బొత్తిగా పరిజ్ఞానం లేకపోగా — ఇంట్రెస్టూ లేదు.

కొద్దిగా సాహిత్యం గూర్చీ, చిత్ర లేఖనం గూర్చీ, సినిమాల గూర్చీ — అయితే ఇంట్రెస్టున్నా ఎదురుగా ఎవరితోనూ కూర్చుని చర్చించటమూ, వాదించటమూ తెలీదు. మా ఇద్దరి అభిరుచులూ వేరయినా భిన్నధ్రువాల మధ్య ఆకర్షణలాగా — చంద్రానికీ నాకూ మధ్య అనుబంధం బాగాపెరిగిపోయింది.

సాయంత్రంపూట ఎవరితోనో చెప్పి కొబ్బరిబోండాలు, తాటిముంజలూ తెప్పించాడు చంద్రం. ఒకటి కొట్టి నాకిచ్చాడు. 'థాంక్స్' చెప్పి తీసుకున్నాను. తనూ ఒకటి కొట్టి తాగిపడేసి నా దగ్గరకు వచ్చాడు. ప్రక్కన కూర్చుని "శశీ! నిన్నో విషయం అడగాలనుకుంటున్నాను." — అన్నాడు. ఖాళీ అయిన బోండాంని ప్రక్కన పడేసి చంద్రం కేసి తిరిగి 'అడగండి!' అన్నాను.

"నువ్వు ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడవెందుకు!"

నాకేం సమాధానం చెప్పాలో తెలీలేదు. అతనన్నదీ నిజమే! ఎవరితోనయినా చాలా తక్కువగా మాట్లాడ్తాను నేను. చిన్నప్పటినుంచీ నా స్వభావమంతే! బహుశా నేనే విషయాలు పట్టించుకోకుండా — ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడకపోవటం వల్లేమో, చాలామంది పరిచయమైన స్నేహితులు మధ్యలోనే దూరమయ్యారు. మళ్ళీ అతనే అన్నాడు. "అందరితోనూ మాట్లాడాలీ, అన్ని విషయాలూ మాట్లాడగలగాలి! అప్పుడే విజ్ఞానం పెరుగుతుంది. నీ చుట్టూ ఏం జరుగుతోందో తెలుస్తుంది. 'వాసు' మాటలబట్టీ, ఇందాక మా స్నేహితులు వచ్చినప్పుడు నీ ప్రవర్తన బట్టి నాకర్థమయిందేమి



టుంటే — నువ్వు నీ చుట్టూ ఒక గిరి గీసుకుని అదే ప్రపంచంగా బతుకుతున్నావ న్పిస్తోంది. అది చాలా ప్రమాదం. శశీ!" నిజమే ఇందాక చంద్రం స్నేహితుల్నంతా తీస్కొచ్చి పరిచయం చేసినప్పుడు — అంత మంది ముందు మాట్లాట్టానికి ఒకలాంటి ఫియర్ ఆవహించటంతో ఎవరితోనూ సరిగా మాట్లాడలేక ముక్తసరిగా మాట్లాడి ఊర్కున్నాను. అయితే చంద్రం నన్ను బాగాఅబ్జర్వ్ చేస్తున్నాడన్నమాట! మా ఇద్దరి మధ్యా కొద్దినిమిషాలు మౌనంగా దొర్లిపోయాయి. దాన్ని ఛేదిస్తూ "నీకో విషయం తెల్సా శశీ! నువ్వు గీసిన బొమ్మలు, కవితలూ — వాసు మీ ఊర్నుంచి తెచ్చినప్పుడు నాకు చూపించాడు. నీ గురించి ఉత్సాహంగా అన్ని విషయాలు చెబుతున్నప్పుడు — నాకేమన్పించిందంటే అన్ని విషయాల్లోనూ రిజర్వ్‌డ్‌గా వుండే మీ వాసు — ఒక్క నీ విషయంలో చిన్న పిల్లాడిలా మారి, నా దగ్గర — అన్ని విషయాలూ చెబుతున్నప్పుడు — నిన్నుచూడాలని, నీతో స్నేహం చేయాలని గాఢంగా అన్పించేది. నీకు బహుశా మా తమ్ముడి వయసు ఉంటుందేమో? అయినానిన్ను మా తమ్ముడితో పోల్చుకోలేను. నా హృదయంలో నీకు ప్రత్యేకమయిన స్థానం ఏర్పర్చుకున్నాను. ఇప్పుడు నా విషయం కాదు ముఖ్యం! నువ్వు మారాలి. నీకోసం, నీ భవిష్యత్తుకోసమే చెబుతున్నాను. మీ నాన్నగారి తర్వాత బిజినెస్ చూసుకోవాల్సింది నువ్వే! బిజనెస్‌కీ, నీ మెంటాలిటీకి చుక్కెదురు! అందుకే చెప్తాంటు... నువ్వు ఈ స్టేజీలోనే మారాలి." ఆగి నా మొఖంలోకి చూశాడు. ఎందుకో సూటిగా చూడలేక పోయాను. మళ్ళీ కొనసాగించాడు. "నిన్న రాత్రి మీ బావగారు పాలిటిక్స్ గురించి చర్చిస్తుంటే నాకా విషయాలు బోరంటూ లేచెళ్ళి పోయావు. కవిత్వం రాయటమొక్కటే మనసు ఎదగటానికి తోడ్పడదు. నీ చుట్టూ జరిగే విషయాలనూ, సంఘటనలనూ చూసినప్పుడు స్పందించి రాస్తే అప్పుడు నీ కవిత్వం పరిపూర్ణమవుతుంది. నీ చుట్టూ వున్న వ్యక్తుల్నీ, వ్యవస్థనీగమనించని నువ్వు కవిత్వంలో సమకాలీన సమస్యల్నెలా చిత్రించగలవు?"

నా మెదడులో అస్పష్టంగా, అడ్డుగా వున్న పొరలేవో విడిపోతున్న భావన! చంద్రం మాటలు హృదయం లోతుల్లో దాగిన "ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్" అనే భూతాన్ని తరిమికొడుతున్న ఫీలింగ్. చంద్రాన్ని మించిన హిప్నాటిస్ట్ ఎవరూ లేరేమో అనే ఊహ. అద్భుతంగా కన్పిస్తున్నాడు చంద్రం! ఇంతలో వదిన ట్రేలో కాఫీ కప్పుల్తో వచ్చింది. "ఏం చంద్రం! మా శశాంకని ఓ చాటర్‌బాక్స్‌ని చేయాలయ్యా! ఎప్పుడుచూసినా ఏదో లోకంలోంచి ఊడిపడ్డట్టు అమాయకుడిలా వుంటాడు" చెరో కప్పు అందిస్తూ అంది. ఆ మాటలకి చంద్రం చిన్నగా నవ్వాడు. నాకెందుకో క్షణంపాటు గిల్టీగా అన్పించింది. వదినటు వెళ్ళగానే చంద్రం అన్నాడు. "చూశావా శశీ! మీ వదినగారికి కూడా నీ మనస్తత్వం అర్థమైపోయింది" అని. తాగుతున్న కాఫీ చేదుగా అన్పించింది. చంద్రం కాఫీ తాగేసి లేచి "నేనేమయినా

కఠినంగా మాట్లాడానన్పిస్తే క్షమించు శశీ! నువ్వు మారితే సంతోషించే వాళ్ళలో మొదటి వ్యక్తిని నేనే! ఏదేమయినా నువ్వంటే నాకెప్పుడూ అభిమానం ఉంటుంది! వస్తాను ఏమండి'' చెప్పి వెళ్ళిపోయాడు. చేతిలో ఖాళీఅయిన కప్పుతో శూన్యమయిన మనసుతో నేనలాగే కూర్చుండిపోయాను.

* * *

పెళ్ళి తతంగం పూర్తయ్యేసరికి రాత్రి తొమ్మిదయ్యింది. తరువాత భోజనాల హడావిడి. వచ్చేవాళ్ళూ, వెళ్ళేవాళ్ళూ — అన్ని పనుల్లోనూ తానే అయి తిరుగుతున్న చంద్రాన్ని చూస్తుంటే — స్నేహానికి నిర్వచనంగా చంద్రాన్నే చూపించాలన్పించింది. అప్పుడప్పుడూ నన్ను చూసి కళ్ళతోనే పలకరిస్తున్నాడు. నేనూ, చిన్న బాబాయి పెళ్ళి మంటపం ముందు కుర్చీలు వేసుకుని కూర్చున్నాం. ఇంతలో వాసన్నయ్య వచ్చి 'భోంచేదురుగాన్ని రండి' అన్నాడు. పక్కన నిల్చుని అందరికీ అన్నీ అందేలా వడ్డించేవాళ్ళకి చెబుతున్నాడు చంద్రం. నా దగ్గరకొచ్చి 'స్వీట్స్' వడ్డించే అతన్ని పిలిచి నాలుగైదు రకాలు వేయమన్నాడు. ''వొద్దొద్దు!'' అని కంగారుగా అంటున్నా నా చేయి పట్టుకుని ఆపి — ''చూడు ఎంత సన్నగా ఉన్నావో!'' ఇకనించీ బాగాతినాలి. నన్ను చూడు ఎలా ఉన్నానో. ఈసారి కలిసేసరికి నాలా తయారవ్వాలి ఏం!'' నేనేం సమాధానం చెప్పలేదు. అన్ని స్వీట్స్ చూసేసరికే నా కడుపు నిండిపోయింది. ఇంకే తింటాను? అన్నీ అలాగే వదిలి — అందరూ లేస్తుంటే నేను లేచాను. చేయికడుక్కొనిఇటు తిరగ్గానే టవల్ అందిస్తూ చంద్రం అన్న మాటలకి నా తల వాలిపోయింది. ''మీ నాన్నగారు సంపాదిస్తున్నారు కాబట్టి నీకు దేని విలువా తెలీటంలేదు. కానీ ఎప్పుడో ఒకరోజు నీకు డబ్బు విలువ — తెలుస్తుంది.'' ఇందాక భోంచేసేప్పుడు విస్తట్లోని పదార్థాలన్నీ అలా

## నరకం!



ప్రేయసిని చూస్తూ పరవశంగా అన్నాడు ప్రియుడు ''నీతో నరకానికైనా సంతోషంగా వస్తా డార్లింగ్!''

''అది మన పెళ్ళయిన తర్వాత సంగతి కదా!'' తాపీగా చెప్పింది ప్రియురాలు.

—గొంటు శ్రీనివాస్ (కడప)

గే వదిలేసి రావటం చంద్రం చూశాడనుకు ంటా! పెద్దనాన్నగారొచ్చి "పైన పక్కలు పరిచే వున్నాయి. వెళ్ళి పడుకో"మ్మని చెప్పటంతో — నా ప్రాణం లేచొచ్చింది. ఈ జనమూ, హడావుడిలో ఇందాకిటినుంచి తలనొప్పి పెరిగిపోయింది. మెల్లిగా గదిలోకె ళ్ళి లుంగీ మార్చుకుని డాబాపైకి వెళ్ళాను. కొందరు అక్కడక్కడా పడుకునే కబుర్లు చెప్పుకుంటున్నారు. నేనెళ్ళి ఓమూల వేసివు న్న పరుపుమీద వాలిపోయాను.

అర్ధరాత్రి ఎందుకో మెలకువ వొచ్చింది. నాకెవరో దుప్పటి కప్పుతున్నారు. చూస్తే 'చంద్రం' మసక వెన్నెల్లో చంద్రుడిలా తోచాడు. నేనంటే తనకెంత శ్రద్ధ! అతని మాటలు ఒక్కోసారి కఠినంగా అన్పించినా — నాపై అతనికి చాలాఅభిమానం అనే విషయం అర్థం చేసుకోగలను.

తెల్లవారుజామున విజయ వాళ్ళ అత్తారిం టికి వెళ్ళిపోయింది. ఇంకా కొందరు దూర పు బంధువులూ ఒక్కొక్కరుగా ప్రయాణ మవుతున్నారు. అమ్మావాళ్ళు ఉంటాననటం తో నేను మాత్రమే బట్టలు సర్దుకోసాగా ను. అదిచూసి వాసన్నయ్యా, వదిన గట్టిగా కోప్పడ్డారు. ఈ సందడీ, ఈ కోలాహలం మధ్య ఇమడలేక ఉక్కిరిబిక్కిరయిపోతున్నా ను. ఎవ్వరూలేని ఏకాంత ప్రదేశానికి వెళ్ళి ఒక్కణ్ణే కూర్చోవాలనే ఆరాటం, — కానీ, వాసన్నయ్యనీ, అక్కలా చూసుకునే వదిననీ బాధపెట్టి వెళ్ళాలన్పించలేదు.

ఆ తర్వాత వారంరోజులూ చంద్రం సాహచర్యంలో క్షణాల్లా కదిలిపోయాయి. 'చంద్రం' తన ఇంటికి ఎన్నిసార్లు రమ్మన్నా వెళ్ళలేదు. అందుకు చంద్రం బాధపడ్డా మనసులో పెట్టుకోకుండా తనే అన్నయ్యవా ళ్ళ ఇంటికి వచ్చేవాడు. ఆరోజే మా ప్రయాణం! అమ్మా, నాన్న, నేను — బయలుదేరాము. వచ్చేప్పుడు వదిన కళ్ళల్లో నీళ్ళు, అక్కయ్య కన్నా మిన్నగా — ఇలాంటి అక్కయ్య ఉంటే బావుంటుందనే భావన నా హృదయంలో చోటుచేసుకోగా — కృతజ్ఞతలు ఎలా తెల్పాలో తెలీక మౌనంగా చేతులు జోడించి వెనుతిరిగాను. అందరికీ చెప్పి జీపులో బయల్దేరాం. స్టేషన్ వరకు చంద్రం, వాసన్నయ్య వొచ్చారు. ట్రైన్ రావటానికి ఇంకా సమయం వుంది. ఈలో గా వాసన్నయ్య పళ్ళూ, నాలుగైదు మాగజై న్స్ తెచ్చిచ్చాడు. ముగ్గురం నిశ్శబ్దంగా వుండిపోయాం. కాసేపయ్యాక అన్నయ్య "బాగా చదవరా కన్నా!" అన్నాడు. నేను మౌనంగా తలూపాను. "లెటర్స్ రాస్తాం టావుగా!" చంద్రం అడిగాడు. "ఆ! తప్పకుండా!" చెప్పాను. ట్రైన్ వచ్చింది. అమ్మా, నాన్న — అన్నయ్యకీ చంద్రానికీ చెప్పి, ట్రైన్ ఎక్కారు. వెనకాలే నేను ఎక్కి బెర్త్‌మీద బ్రీఫ్‌కేస్ వుంచి డోర్ దగ్గరకొచ్చాను. ట్రైన్ కదిలింది. అన్నయ్య, చంద్రం కళ్ళల్లో బాధ స్పష్టంగా కన్పించింది . అప్రయత్నంగా చేయూపాను. వాళ్ళూ చేయివూపారో లేదో నాక్కన్పించలేదు — కారణం నా కళ్ళనిండా నీళ్ళు!

* * *

ఆ తర్వాత చంద్రానికి ఢిల్లీలో ఎమ్.ఎస్ .సిలో సీట్ దొరకటంతో వెళ్ళిపోయాడు. అక్కణ్ణించి వారానికో ఉత్తరమయినా వ్రాసే

వాడు. ప్రతీ ఉత్తరంలో నాకో టాపిక్ ఇచ్చేవాడు. ఆ టాపిక్‌పై కవిత వ్రాసి పంపమంటూ! ఓసారి కట్నం గురించీ, మరోసారి సమాజం గురించీ, రాజకీయాల గురించీ — ఇలా తను నా మెదడుకి మంచి పని కల్పించేవాడు. నేను వ్రాసి పంపిన కవితలపై, సూటిగా తన అభిప్రాయం వ్రాసేవాడు. బావుంటే బావున్నాయని, లేదంటే ఎందుకు బాగాలేవో — వివరించేవాడు.

ఒక్కోసారి సమకాలీన సమస్యను వ్రాస్తూ గ్రాంధిక పదాలు ప్రయోగించేవాణ్ణి! అది చంద్రం విమర్శించేవాడు. సాధ్యమైనంత సరళతలోనే వ్రాస్తే వచన కవిత్వం బావుంటుందనే వాడు. రాజకీయాల గూర్చి కొన్ని ప్రశ్నలు వేసేవాడు. తెలీకపోతే అడిగి తెల్సుకుని వ్రాయమనేవాడు.

ఇలా — సాహిత్యం నుంచి స్టార్‌వార్స్ వరకూ — క్రికెట్ నుంచి కీట్స్ పొయెట్రీ వరకూ. నేను అర్థం చేసుకునేల చేశాడు.

కాలచక్రం గిర్రున తిరిగింది;. మూడేళ్ళు గడిచాయి. చంద్రం చదువు పూర్తి చేసుకుని ఎ.పి. వచ్చాడు. నా కవితలు పత్రికల్లో రాసాగాయి. రెండు మూడు కథలూ, కొన్ని వ్యాసాలు ప్రచురించబడ్డాయి . చిత్ర లేఖనంలో మెళకువలూ సంపాదించాను! ఇప్పుడు నాకు ఫ్రెండ్స్‌తో మాట్లాడాలంటే ఇదివరకులా బెరుకూ, భయమూ మచ్చుకికూడా లేవు. ఆత్మ విశ్వాసంతో తిరగ్గల్గుతున్నాను! నాన్నగారి ఆరోగ్యం బాగా లేని కారణంగా డిగ్రీతోనే చదువుకి ఫుల్‌స్టాప్ పెట్టి బిజినెస్‌లో దిగాను. సంవత్సరంలోనే ప్రొడక్ట్స్ ఇంకా పెంచాను. చంద్రం సలహా ప్రకారం రెండు కొత్త బ్రాంచ్‌లు తెరిచాను.

క్రొత్తగా ఎ.సి కారొకటి కొన్నాను. సంఘంలో గౌరవ మర్యాదలూ, పరపతీ పెరిగాయి.

ఇదంతా నా అదృష్టమూ, కృషే అని ఎప్పుడూ అనుకోలేదు. నా వెనక అజ్ఞాతం

## పొటాషియం!



క్యాన్సర్ భయంకరమైన వ్యాధి అని మనకందరకూ తెలుసు! అయితే ఆహారం విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసికొంటే... ఆ భయంకర వ్యాధికి దూరంగా ఉండవచ్చునని డాక్టర్లు అంటున్నారు. క్యాన్సర్‌లాటి వ్యాధులు మన ఆహారంలోని 'పొటాషియం' అనే ఖనిజ లవణం లోపంవల్లనే వస్తాయని డాక్టర్లు ప్రయోగాత్మకంగా నిరూపించారు! మరి 'పొటాషియం' ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాల్ని తీసికొంటే... ఇలాంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చునేమో? ప్రయత్నించి చూడండి!

—జూపిటర్

గా నిల్చుని అనుక్షణమూ నా వెన్ను తట్టి ప్రోత్సహించే చంద్రం మాత్రమే నా ఉన్నతికి కారణమని ఎప్పుడూ మర్చిపోలేదు.

స్నేహితులందరూ 'హితులు' కాలేరు. నాజీవితంలో చంద్రమే తటస్థపడకపోతే 'కూపస్థ మండూకం'లా — నాఅభిరుచులే లోకంగా బ్రతికే వాణ్ణేమో!

అందుకే, తాను నాటిన మొక్క ఎంత గా ఎదిగిందీ, ఎందరికో నీడనిచ్చే మహావృక్ష ంగా మారిందీ చూడటానికి రమ్మని చంద్రానికి ఉత్తరం రాసాను. నా ఉత్తరం చూసి చంద్రం వెంటనే వస్తాడనుకున్న నా ఆశ నిరాశే అయింది. చంద్రం రాలేదు గానీ వారం రోజుల తర్వాత వాసన్నయ్య ఉత్తరం వచ్చింది. ''చంద్రానికి రావటం ప్రస్తుతం వీలుకాదు కాబట్టి, నువ్వేరాగలవు. అలాగే నిన్ను మేము చూసినట్టుంటుంది.'' — అంటూ!

నా బిజీవల్ల పది రోజులు ఆలస్యమయిం ది. మొత్తానికి వ్యవహారాలన్నీ సెటిల్ చేసుకుని — వస్తున్నట్టు టెలిగ్రాం ఇచ్చాను . చంద్రం ఆయిల్ పెయింట్ నా చేత్తో గీసింది ప్యాక్ చేశా! అయిదు పదికి స్టేషన్ కి బయలుదేరాను. ఇంకా తెలవారలేదు. కాస్త చలిగా అన్పించింది. అయినా నా ఆత్రుత ముందు వేరే ఏమీ పట్టింపులోకి రాలేదు. ఇంతలో ట్రెయిన్ వొచ్చింది. ట్రెయిన్ ఎక్కిన క్షణం నుండీ నాలో టెన్షన్ క్షణక్షణానికి అధిక మవసాగింది. ఎప్పుడెప్పు డు 'జనగాం' చేరతాను. ఎప్పుడు చంద్రా న్ని కలుస్తాను అనే ఆత్రం నాకు మరీ పెరిగిపోయింది. నన్ను చూసి చంద్రం ఏమంటాడు?

''బాలుడిలా కనిపించే నువ్వు ఆకాశమం తా ఓ అడుగు నింపి — మరో అడుగు అసమర్థత అనే చక్రవర్తిని అణగ్రదొక్కుతు న్న వామనుడిలా కనిపిస్తున్నావంటాడా? నా ఆలోచనకి నాకే నవ్వొచ్చింది.

స్టేషన్ లో ట్రెయిన్ ఆగగానే — డోర్ దగ్గరకెళ్ళి చూశాను. వాసన్నయ్య ఒక్కడే కనిపించాడు. అదేమిటి? చంద్రం రాలేదేం ? ఒక్క క్షణం బాధపడ్డా వెంటనే సర్దుకుని — చిరునవ్వుతో అన్నయ్యకెదురెళ్ళాను. ''శశీ! ప్రయాణం బాగా జరిగిందా ?'' ''ఆ! అందరూ బావున్నారా?'' తలూపి బ్రీఫ్ కేస్ నాచేతిలోంచి అందుకుని నడిచాడు. వెనకాలే నేను... బయటకెళ్ళాక ఎంత బింకంగా వుండాలన్నా ఉండలేకపో యాను. స్కూటర్ వెనకాల కూర్చున్నాక అడిగాను ''చంద్రం రాలేదేం స్టేషన్ కి!?'' ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడెందుకో అన్నయ్య '' ఆ... తనూ... 'బయలుదేరాక ఎవరో ఫ్రెండ్స్ వస్తే ఆగిపోయాడు.'' ఒక్కక్షణం మనసు చివుక్కుమంది, అయినా వెంటనే సర్దుకున్నాను.

ఇలా బాధపడ్డాను అని తెలిస్తే చంద్రం 'నీ ప్రవర్తనలో ఏం మార్పురాలేదు...ప్చ్!' అంటూ పెదవి విరుస్తాడేమో అనే భయం తో అన్నయ్యని మరేం ప్రశ్నించలేదు.

స్కూటర్ వెళుతూంటే గమనించాను — మూడేళ్ళ తరవాత కూడా ఇళ్ళలో ఎలాంటి మార్పూలేదు. ఊరికి కొద్దిగా ఇవతల ఒక ఫెర్టిలైజర్స్ గొడౌన్, విసిరేసినట్టున్న నాలు గైదు సిమెంట్ తో కట్టిన డాబా ఇళ్ళు —

తప్పు చెప్పుకోతగ్గ మార్పేమీ లేదు.

ఇంటికెళ్ళాక వదిన కుశల ప్రశ్నలూ — పెదమ్మ, పెద్దనాన్నల పలకరింపులు అయ్యాక స్నానం చేసి టిఫిన్, కాఫీ పూర్తి చేసి డ్రస్ చేసుకున్నాను. వాసన్నయ్య గదిముందుకు వెళ్ళి తలుపుతట్టాను. వదినా అన్నయ్యా ఏదో విషయం సీరియస్‌గా చర్చించుకుంటున్నారు. శబ్దం వినగానే వదిన నన్ను చూసి మౌనంగా బయటకెళ్ళిపోయింది.

''ఏరా! ఎక్కడికీ డ్రస్ చేస్కున్నావ్?'' బయటకొస్తూ అడిగాడు అన్నయ్య.

'చంద్రం దగ్గర కెళదామన్నయ్యా!'' అన్నాను మెల్లిగా!

ఒక్క క్షణం నా వేపు పరిశీలనగా చూసి ''సరే పద!'' అన్నాడు.


స్కూటర్ మీద కూర్చున్నాక అడిగాను. '' అసలు తనే వస్తాడనుకున్నాను. ఇంకా రాలేదేం?''

''ఏమో '' అన్నాడన్నయ్య సాలోచనగా. నేను మరేం ప్రశ్నించలేదు.

స్కూటర్ వొచ్చి ఓ పెద్ద గేటు ముందాగింది. స్కూటర్‌ని బయట ఆపి గేటు తీసుకుని లోపలికి అడుగుపెట్టాము. బాటకిరుపక్కలా క్రోటన్స్... నా రాకకు సంతోషంగా తలలూపుతున్నట్లు తోచింది.. ఆ ఇంటి వాతావరణం చాలా బావుంది. చల్లగా.. ప్రశాంతంగా!'చంద్రం'మనసులా!!

డాబా ఇల్లు! డోర్ దగ్గరకెళ్ళి తలుపు కొట్టాడు అన్నయ్య. చంద్రం పోలికలు కొద్దిగా ఉన్న ఒకావిడ — చంద్రం తల్లిగారనుకుంటా... తలుపు తీసారు. చూడగానే రెండు చేతులూ జోడించాలన్పించేంత అమృత మూర్తిలా తోచారావిడ. ముఖంలో కొంచెం విచార రేఖలు. అది నా భ్రమేమో? మమ్మల్ని చూసి మౌనంగా పక్కకు తొలగి దారిచ్చారావిడ. లోపలికడుగు పెడుతూంటే కాళ్ళు తడబడ్డాయి. క్షణకాలం మనసెందుకో కీడును శంకించింది.

అన్నయ్య ఓ గది ముందుకు వెళ్ళాడు.



బహుశా చంద్రం గది అనుకుంటూ! వెనకే నేను! నన్నో క్షణం చూసి మెల్లగా తలుపు తీశాడు. అక్కడ చంద్రం కుర్చీలో కూర్చుని బయటకు చూస్తున్నాడు అలికిడికి మావేపు తిరిగి చూశాడు. నేను ఆత్రంగా అతని దగ్గరకు పరిగెత్తాను. దగ్గరకెళ్ళాక గమనించాను. చంద్రం కూర్చున్నది మామూలు చైర్‌లోకాదు వీల్ చెయిర్!'

నా కళ్ళు చంద్రం వైపు... అంతే నాకాళ్ళు భూమిలోకి కృంగిపోతున్న భావన!

కారణం.... చంద్రం పాదాలురెండు ఆర్టిఫిషియల్! జైపూర్ కాళ్ళు! నాచేతిలోంచి చంద్రం ఆయిల్ పెయింట్ జారిపోయింది. నాకు తెలీకుండానే మోకాళ్ళపై కూలబడ్డాను. నమ్మలేని నిజాన్ని నమ్మవలసొచ్చిన దురదృష్టకరమైన క్షణమిది.

'నిశ్శబ్దం భయంకరంగా అన్పించింది. అది ఛేదిస్తూ — వాసన్నయ్య గొంతు —

“నీ ఉత్తరం చూసి వెంటనే బయలుదేరాడు. ట్రయిన్ ఎక్కించటానికి నేనూ స్టేషన్‌కి వెళ్ళాను. మేమెళ్ళేసరికి ట్రైన్ మూవ్ అవుతోంది. టిక్కెట్ కూడా తీసుకోకుండా కదులుతున్న ట్రైన్ ఎక్కబోయాడు. కాలు స్లిప్ అయింది. అంతే! రెండు కాళ్ళూ మోకాళ్ళ క్రింది నుండీ..” ? క్షణం ఆగాడు. నీకు అస్సలు తెలీనీగూడదన్నాడు. ఎప్పటికైనా తెలుస్తుందని — నేనే నిన్ను రమ్మని ఉత్తరం రాశాను' ఆ తర్వాత మాటలు విన్పించలేదు.

“చంద్రం!” పిలిచాననుకున్నాను. నా గొంతు నాకే విన్పించలేదు. చంద్రం నన్ను పరిశీలనగా చూస్తున్నాడు. ఈ బేలతనం కాదు చంద్రం నాలో ఆశించింది. అంతే! క్రింద పడ్డ చిత్రపటాన్ని అందుకున్నాను.

“చంద్రం! నీ చిత్రపటం...! యూనా! నీ ఫోటో కూడా చూడకుండా వేసాను. నా హృదయమంతా ఆక్రమించుకున్న నీరూపాన్ని చిత్రించాను. ఇది కుంచెతో వేసింది కాదు. నా హృదయంతో గీసింది!”

చంద్రం నిశ్శబ్దంగా ఆ చిత్రపటాన్ని అందుకున్నాడు. కాసేపు దానివంకే తదేకంగా చూసి, ఒడిలో పెట్టుకుని నన్ను దగ్గరగా రమ్మని సంజ్ఞ చేశాడు. అతని కళ్ళలోతృప్తి!

దగ్గరగా వెళ్ళాను.; నా ముఖాన్ని తన రెండు చేతులతో పట్టుకుని నుదిటిపై ముద్దు పెట్టుకున్నాడు. చిన్నప్పుడు అమ్మ పెట్టుకున్న ముద్దూ సరిగా గుర్తులేదు. 'నాకింత గొప్పకానుక నిచ్చావు.మరి నీకేమివ్వాలను?' అన్నాను.

అప్పుడు నోరువిప్పాడు చంద్రం. అమృత వర్షం కురిసినట్టు. పూలు రాలి నట్టు!

'నాలాంటి వారికి ఓదార్పునిచ్చే అద్భుతమైన వ్యక్తిగా మారావు. నాకది చాలు! ఇంత గొప్ప రమ్యమైన అనుభూతి నిచ్చావు. ఇంకా 'ఏమివ్వగలను' — అంటావేంశశీ!” నా కళ్ళు ఆనందంతో మెరిసాయి. 'మిత్రమా! నాకోసం నీ జీవితాన్నే కానుకగా ఇచ్చావు. నీకోసం నేను కాస్త ఓదార్పునయినా ఇవ్వలేనూ? నన్ను మరో 'చంద్రం'గా తీర్చిదిద్దిన నీకు ఏమిచ్చినా రుణం తీరదు.' అనుకున్నాను మనసులో!!